# ఊరు కాలింది



యెన్నం ఉపేందర్

**ఇంకా తెల్లవారలేదు. అమావాస్య రోజులు చీకటి దట్టంగానే ఉంది. మిణుకు మిణుకు మంటున్న లాంతర్ల వెలుగు పెంచుకోసాగాయి. ఆ ఊరు రోజువారి కార్యక్రమాలకు సిద్ధం అవుతున్నట్లుంది. ఎక్కడో కోడి కూసింది. అంతే... వరసబెట్టి కోళ్ళు కూయ సాగాయి. పొయ్యిల పడుకున్నాయేమో! వంటికంటిన బూడిద దులుపుకుంటూ వీధిలోకి రాసాగాయి కుక్కలు.**

అమ్మలక్కలు వాకిలూడ్చుతున్న శబ్దం, చేద బావిలో బొక్కెన వేసిన శబ్దం, 'గిరుకు, గిరుకు' అంటున్న 'గిరక' శబ్దం వినబడసాగాయి.

"గిర్క లొల్లి జర ఆపుతవా? గొడ్లను పొలం తోల్కబోతన్న. పొద్దుగాల వంట జేసి సద్దిబట్టుకరా. ఇయ్యాల దుక్కి దున్నుడు కతం జెయ్యాల" అన్నాడు ఎల్మంచ భార్యతో. భార్య సమాధానం కోసం వేచి చూడ కుండా నాగలి భుజాన వేసుకుని సాగిపోయాడు.

వీధిలో కలకలం పెరగసాగింది. గొర్ల బేబే అంటూ 'కంపమంద' తొలగించగానే 'మందకు మంద' బజారును ఆక్రమించాయి. భుజాన గొంగళి వేసుకొని, చిప్ప గొడ్డలి ఓ చేత బట్టి, ఇంకోచేత గట్కబుడ్డి దుడ్డుకర్రకు తగిలించుకొని గొర్లను అదిలిస్తూ గొర్ల వెనుకాల కదిలాడు ఈరమల్లు.

"ఒరెక్కో! ఒక్కరోకున నడ్వవేందిరో?!

రానురాను గొర్లకు మేత దొర్కుడు బవు కట్టమైతండి.

ఇయ్యాల 'పురేడుగుట్టకు' తోల్కబోత. జీవాలకు సరిపడ మేత దొర్కది ఆడయితే" మనసులో అనుకున్నాడు ఈరమల్లు.

ఈరమల్లుకు, వీధి మలుపులో అంజయ్య ఎదురయ్యాడు. ముస్తాదు, కాళ్ళగుడి, నెరుసు రాసిన కత్తి, కావడి బద్ద, కల్లు-కుండతో ఎదురైన అంజయ్యతో,

"అంజన్నా, పోత్తాదు కల్లు వాడిక పొయ్యరాదే ఓ రెండు నెల్లు? నువ్వైతే ఒక్క తాడు కల్లు నీతిగా బోత్తవు" అన్నాడు ఈరమల్లు.

"గీతబెట్టి కల్లు వదుసుకొత్త. జర పొద్దెంకినంకరా" జవాబిచ్చాడు అంజయ్య.

"మజ్జాన్నం రావడం కుదరదే. తల్లి కడ్పుల పొద్దు బడ్డంక వత్త. రాత్రికి కల్లుంచు" అన్నాడు ఈరమల్లు.

"పొద్దున్నే ఎవ్వలు పల్కరించకముందే ఎల్దామనుకుంటే ఎవరో ఒకరు పలకరిత్తాండ్రు" అని మనసులో అనుకుంటూ "గట్టనే మల్లన్నా" అని పైకి అన్నాడు, అంజయ్య.

తెల్లవారింది.

ఆ ఊరి దొర జీతగాడిపైన కోపం ప్రదర్శిస్తున్నట్లుంది. ఆయన కేకలు గడిగోడ దాటి వినబడుతున్నాయి.

"అరేయ్ లచ్చిగా. కూలిజనాన్ని పోగుజేసుకొని పొలానికి పోరా అంటే తీరా తెల్లారినంక వచ్చినవేందిరా? ఎప్పుడు బోతరు ఎప్పుడు వరిగోత్తరు..." బూతులు తిడుతున్నాడు దొర. ఆయన మాటలకు బంగ్లా అదురుతోంది.

ఆ బంగ్లా ఆ ఊరి జనానికి చాలామందికి తెలియదు. గుమ్ముల నిండా వడ్లు, వందలాది పశుగణం. పట్నం నుంచి తెప్పించిన ఫర్నీచరు, పనిమనుషులతో నిండుగా ఉంటుంది. కరవు, కష్టకాలాలు ఆ గడిగోడల దరి కూడా చేరవు.

పొద్దు పొడిచింది. తూర్పు ఎరుపు సంతరించుకుంది. ఆ ఊరు పశ్చిమ బజారున కొలిమి వెలిగింది. బొగ్గులు, నలుపును కోల్పోతున్నాయి; తిత్తులు ఆడే కొద్ది. బొగ్గుల్లో కూరుకున్న ఇనపముక్క ఎర్రగా మారసాగింది. కొద్దిసేపట్లో ఆ ప్రాంతం సమ్మెట దెబ్బలతో ప్రతిధ్వనించసాగింది. విరిగిన బండిపోల్లు, తుమ్మ మొద్దులు, సగం చెక్కిన బండి ఆకులు, మొండికత్తులు, గొడ్డండ్లతో ఆ ప్రదేశం నిండి ఉంది. నోట్లో వేపపుల్లతో ఓవైపున పళ్ళు తోముతూనే పనిచేయసాగాడు శేషయ్య.

సూర్యుడు చరచరా పైకి రాసాగాడు. పొద్దు చురచుర మంటోంది. బజార్లో అద్దకం నీల్లు రావటం మొదలుపెట్టాయి. రంగురంగుల దారాల, నేత చీరకు గంజిపెట్టి 'సరి' చేస్తున్నాడు రాంనర్సయ్య. పక్కూరి దొరసాని కోరినవిధంగా రంగురంగుల దారాలు కలబోసి, జరిపెట్టి 'పొద్దుమాపు' చీర నేసాడు. భద్రంగా చీరను ప్యాక్ చేసుకొని, కూనిరాగం తీస్తూ చెరువుకట్ట ఎక్కాడు రాంనర్సయ్య. వంకరటింకరగా ఉన్న కట్టకు ఓవైపున దట్టంగా మొలిచిన 'సర్కారు తుమ్మలు', ఇంకోవైపున 'నిండు చెరువు' కనులకు పరవశత్వాన్ని కలుగజేస్తాయి.

ఎండ నెత్తిమీదికొచ్చింది. 'చాకలి పొయ్యి' భగభగ మండుతోంది. పొయ్యిపైన మైలగుడ్డలు 'తుకతుక' ఉడుకుతున్నాయి. రాజయ్య ఒక్కొక్క బట్ట, కట్టె సహాయంతో తీసి ఇస్తుంటే, అతని భార్య 'సోయ్‌సోయ్' అంటూ బండకు బాదటం మొదలుపెట్టింది.

"ఎటు బోతన్నవే? పొద్దుగూకకముందే ఊళ్ళకు తిర్గిరా. మన ఎమ్మెల్యేగారొత్తండ్రు. మీటింగు ఉందట. ఎన్నికలు దగ్గరబడ్డయి కదా" అన్నాడు రాజయ్య.

"పక్కూరికి బోతన్న. నేం రాకుండ ఉంటన దొరొత్తండంటే! గీ తేవ పచారం జోరుగజెయ్యాల" జవాబిచ్చాడు రాంనర్సయ్య.

మిట్ట మధ్యాహ్నం దాటింది. చూస్తుండగానే సాయంత్రం అయ్యింది. చెరువు మీదుగా కొంగలు బారులుబారులుగా ఎగురుతూ, తమతమ స్థావరాలకు వెళుతున్నాయి. పిచుకల గోల పెరిగింది. ఉదయాన్నే మేతకు వెళ్ళిన బర్లు నెమ్మదిగా నడుస్తూ, నెమరేస్తూ ఊరు ముఖం పట్టాయి.

దుమ్ము లేసింది...

జీపులు రాసాగాయి.

"యాది మర్సిన. యియ్యాల ఎమ్మెల్యే వొత్తండుగా! ఊళ్ళకు ఉర్కి కల్లు దాగి మీటుంగుకు బోత" అనుకున్నాడు ఈరమల్లు.

"నువు గూడా రారాదే అంజన్నా. మీటింగు జబర్ దస్తుగుంటది" ముంతను పక్కనబెడ్తూ అన్నాడు ఈరమల్లు.

"ఒర్నీ నేంరాకుంట మీటింగు నడుత్తదా?! దొర నాకు దెలుసు. పొయినేడాది దొరెంట వొచ్చినోల్లకు పుల్‌గా కల్లు పోసినగదే నేను?! దొర యాది మరుత్తనా"?! ప్రశ్నించాడు అంజయ్య. ఇద్దరు కలిసి బయల్దేరారు మీటింగుకి. దారిలో ఎల్మంచ కలిసాడు.

"ఏంటే! నువు రావట్లేదా మీటింగుకు" అడిగాడు ఈరమల్లు అనుమానంగా.

"ఆఁ ఏం లాభం? అన్నీ పిరమైనయి. కొనబోతే కొరివి, అమ్మబోతే అడివి లెక్కుంది. గొల్లు వొచ్చి ఇది చేత్తం అది చేత్తం అంటరు. ఎక్కడేసిన గొంగలి అక్కడే" నిరసనగా అన్నాడు ఎల్మంచ.

మీటింగు మొదలైంది. చీకటి కమ్ముకోసాగింది. ఎమ్మెల్యే ఆవేశంగా ప్రసంగిస్తున్నాడు. ఓటు తనకే వేయాలని జనాన్ని కోరుతున్నాడు. జనం 'జిందాబాద్' అంటూ గగ్గోలుగా అరిచి అరిచి, అలసి ఇంటికి చేరారు.

** ** **

ఎన్నికలు దగ్గరబడే కొద్దీ ఊరిలో చాలా మార్పులు చోటుచేసుకోసాగాయి. ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న ఇంకో అభ్యర్థి ఊరును సందర్శించాడు. ఆ మీటింగుకు కూడా జనం బాగానే వచ్చారు. ఊరి జనంలో ఇదివరలో లేనివిధంగా ఆస్తి అంతస్థుల తేడాలు. కుల తారతమ్యాలు ముందుకొచ్చాయి. దానికితోడు, కరెన్సీ నోట్లు, కల్తీసార ఊరును ముంచెత్తాయి.

ఈమధ్య కొలిమి ఆగిఆగి రాజుకోసాగింది.

మైలబట్టలు గుట్టలుగా పేరుకుపోసాగాయి.

మగ్గం నాడెలో దుమ్ము పేరుకుంది.

వచ్చిపోయే జీవుల చుట్టూ పిల్లలు గుమికూడి బడికి పోవడం మానేసారు. లౌడుస్పీకర్ల హోరులో ఊరంతా హడావిడిగా ఉంది. ఊరు వర్గాలుగా చీలింది.

"ఎన్నికలు రేపే. ఎవరి జాతకం ఎలాగుందో?" మనసులో అనుకున్నాడు ఎల్మంచ. ఆరోజు ఎప్పటి లాగానే ఉదయాన్నే పొలం వెళ్ళి, చీకటి పడకముందే ఊరుముఖం పట్టాడు ఎల్మంచ. ఏవో కేకలు వినబడుతున్నాయి. అవి పరిచయమైన గొంతులు. రచ్చబండ దగ్గర జనం గుమికూడారు. రాంనర్సయ్య, శేషయ్య, అంజయ్య, ఈరమల్లుల చేతిలో కర్రలు ఉన్నాయి.

"గడగొయ్యలు తీస్కరాండ్రా. నా కొడుకుల ఇరగదియ్యాల" దొర అరుస్తున్నాడు. కొద్దిసేపట్లో తలలు పగలటాలు, కాల్లు రెక్కలు విరగడాలు జరిగిపోయాయి. గుంపులోని వారందరూ ఏదో విధంగా గాయపడ్డారు. దూరంగా నిలబడిన ఎల్మంచకు కూడా దెబ్బలు తగిలాయి. తెల్లవారి పోలీసు బందోబస్తు మధ్య ఎన్నికలు జరిగాయి. మరలా పాత ఎమ్మెల్యేనే గెలిచాడు.

** ** **

కొన్ని సంవత్సరాలు గడిచాయి. ఈమధ్యలో ఊరు బాగా మారింది. ఏదో గ్రామీణాభివృద్ధి పథకం క్రింద ఊరుకి రోడ్డొకటి వేసారు. పండిన ధాన్యం కళ్ళం నుంచి సరాసరి మార్కెట్టుకు తరలించసాగారు దళారులు. రైతులు షావుకారులకు బాకీ కింద పండిన ధాన్యాన్ని కొలవటం, షావుకారు పట్నం దళారులకు గుత్తకియ్యటం జరుగసాగింది.

ఇలా ఉండగా ఆ ఏడు కరవు పరిస్థితులు నెలకొన్నాయి. అదే పరిస్థితి కొన్ని సంవత్సరాలు కొనసాగింది. ఎల్మంచ మునపటిలా ఉదయాన్నే పొలం వెళ్ళటం మానుకున్నాడు. బావులు ఎండిపోయాయి. ఉన్న పశువుల్ని ఎల్మంచ అమ్ముకున్నాడు.

"బాయిల నీల్లు లేవు. గిర్క ఇరగ్గొట్టి పొయ్యిల బెట్ట" అని ఓ ఇల్లాలు చేదబావి గిరకను తీసుకపోయింది.

ఇప్పుడు కోడిపుంజు ఉదయాన్నే గొంతు సరవరించుకోలేకపోతుంది. వీధిలో గొర్ల అరుపులు లేవు. అద్దకం నీల్లు బజార్లో కనిపించటం లేవు. రాంనర్సయ్య, నేసిన బట్ట 'ఎవ్వరు కొనటంలేదని', మగ్గం గుంట పూడ్చాడు. చాకలి పొయ్యి నేల గలిసింది. కూలిజనం, 'దొర ఎంతిత్తే అంతచాలని' నిర్ణయించుకున్నారు. తరం మారింది. ఇప్పుడు రచ్చబండ మీద నవతరం కూర్చొని దేశ రాజకీయాలు, నాయకుల గురించి, రాయలసీమ ఫాక్షనిజం గురించి వాడిగా, వేడిగా చర్చలు జరపటం నిత్యకృత్యమైనది. ఆ ఊరి దొర కూడా చర్చల్లో పాల్గొనేవాడు. క్రమేణా వారి చర్చలు కొత్త దిశగా రూపుదిద్దుకోసాగాయి. దొర అప్పుడప్పుడు ఊర్లోకి విస్కీ, బ్రాందీ తెచ్చేవాడు. ఓ సంధ్యా సమయాన వారందరూ ఓ నిర్ణయానికి వచ్చారు.

"బతికే నాలుగురోజులు దర్జాగా బతకాల. నాలుగు ఊర్ల జనాన్ని మన చేతిలో పెట్టుకోవాల. ఎదురు జెప్పినోన్ని ఇరగదియ్యాల. రాయలసీమను మనూర్ల జూడాల" ప్రతినబూనారు అందరూ.

అనుకున్నదే తడవుగా ఏర్పాట్లు జరిగిపోయాయి. గాజుముక్కల్ని పొడిచేసి, బాంబులు చుట్టటం, నాటు తుపాకులు తయారుచేయటం నేర్చుకున్నారు.

ఇప్పుడు కొలిమి సైకిలు చైన్లకు పిడి బిగించటానికి, వేటకొడవల్లు తయారుచేయటానికి ఉపయోగపడసాగింది. బజార్లో రంగుల అద్దకం నీల్లకు బదులు, నెత్తురు ప్రవహించసాగింది. గొర్ల అరుపులకు బదులు, ఎవరిదో గొంతు తెగిన ఆర్తనాదాలు వినిపించసాగాయి.

ఇదిలా ఉండగా ఊర్లో నాటుసార బట్టీలు విపరీతంగా పెరిగాయి. మగవాల్లు తాగుడుకు బానిసయ్యారు. ఆడవాల్లు పొద్దస్తమానం కూలిజేసి 'ఇంతో' 'అంతో' సంపాదించి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు.

ఇప్పుడు కోడిపుంజు ఉదయాన్నే గొంతు సవరించుకోలేక పోతుంది. వీధిలో గొర్ల అరుపులు లేవు. అద్దకం నీల్లు బజార్లో కనిపించటం లేవు. రాంనర్సయ్య, నేసిన బట్ట 'ఎవ్వరు కొనటం లేదని', మగ్గం గుంట పూడ్చాడు. చాకలి పొయ్యి నేల గలిసింది. కూలిజనం, 'దొర ఎంతిత్తే అంతచాలని' నిర్ణయించుకున్నారు. తరం మారింది.



దసరా పండగ వచ్చింది. నవతరం ఎప్పటిలాగానే రచ్చబండ దగ్గర రాజకీయ చర్చ మొదలుబెట్టారు. ఏదో అంశం మీద భేదాభిప్రాయం ఏర్పడింది. అంతే. రెండువర్గాలుగా చీలిపోయారు. కొట్లాటకు దిగారు. ఇరువర్గాలకు తలలు పగిలాయి. గొడవ సద్దుమణగక ముందే ఎవరో పక్క ఊరి నుంచస్టేషనుకు ఫోను చేసారు. పోలీసులు నిన్ననే, ఆ ఊరికి, దసరా మామూల్లకు వచ్చారు. ఆ ఊరి దొర ఓ పొట్టేలు, బస్తా బియ్యం ఇచ్చాడు.

వంట పూర్తయ్యి భోజనానికి కూర్చుందామని ఎస్సై కానిస్టేబుల్లు అనుకుంటుంటే, ఊర్లో కొట్లాట జరుగుతుందని ఫోను రావటంతో పోలీసులు ఆగ్రహోదగ్రులయ్యారు. అదే ఊపులో జీపులో ఊరికొచ్చారు. జీపు దిగటంతోనే చేతికి దొరికినవాళ్ళను లాఠీ విరిగేటట్లు కొట్టారు. ఆడ, మగ, ముసలి, పిల్ల తేడా లేకుండా వడ్డించారు. ఊరంతా దదదదలాడిపోయింది. పేపర్లు ఆ సంఘటన గురించి ప్రముఖంగా రాసాయి. 'మనూరు పేపర్లో పడ్డదని' సంతోషించిన వారున్నారు, 'ఎలాంటి పరిస్థితివొచ్చే ఎలాంటి ఊరు ఎలాగైపోయే' అనుకున్నవారు ఉన్నారు. ఆ రెండో వర్గానికి చెందినవారిలో ఎల్మంచ కూడా ఉన్నాడు.

అలా కొన్ని నెలలు గడిచాయి. సర్పంచు ఎలక్షన్లు ప్రకటించారు. ఆ ఊరి దొర సర్పంచు పదవికి నిలబడ్డాడు. ఊరి జనంలో కొంతమంది ఎల్మంచను నిలబడమని అడిగారు.

"ఏహె! నేనేంటి సర్పంచి పదవికి నిలబడటమేంటి? నాకు గసంటి ఆలోసన్లు లేవు" అన్నాడు ఎల్మంచ ఒకింత ఆశ్చర్యంతో.

"గది కాదే ఎల్మంచన్న. నువు నిలబడాల్నే. కల్మషం లేనోడివి. దొర నాకు యాద్కున్నప్పటి నుంచి సర్పంచి పదవి జేత్తండు. ఊరు ఏమాత్రం బాగుప్డ నిలబడాల" అన్నాడు రాంనర్సయ్య. 'అవునవును' అన్నారు శేషయ్య, అంజయ్య, ఈరమల్లు. ఎల్మంచను బలవంతాన ఒప్పించారు.

"ఏంటేంటి ఎల్మంచగాడు నాకు పోటా?! నవ్వొతంది నాకు. సూర్యుడు పొద్సొకముందే ఊర్ని వొదిలి సెల్కకు బొయి, పొద్దుగూకినంక ఇంటికొచ్చేటోడు- ఈడికి ఇంత దమ్మెట్లొచ్చిందిరా" ఆవేశంగా అన్నాడు దొర.

సర్పంచు ఎలక్షన్లు రేపనంగా ఓ రహస్య సమావేశం దొర ఇంట్లో జరిగింది. 'దొర గెలుపు అవకాశాలు దాదాపు శూన్యం' అని సమావేశానికి హాజరైన అందరు తేల్చారు. 'ఒకేమార్గం' అన్నాడు దొర.

నిముషాల్లో చేతి సంచుల్లోకి బాంబులు, తపంచాలు చేరిపోయాయి. వేట కొడవల్లు, సైకిలు చైన్లు, చిప్ప గొడ్డండ్లు తీసుకున్నారు. దాడి మొదలైంది. రచ్చబండపై బాంబులేసారు. ఆ శబ్దానికి, ఊరి జనం బెంబేలెత్తి తలుపులు మూసి గడియ వేసుకున్నారు. కొద్దిసేపట్లో ఎల్మంచ సానుభూతిపరుల ఇండ్లు తగలబడ్డాయి. గుంజుకుంటున్న రాంనర్సయ్యను మగ్గం గుంటలో వేసి, పొడిచి చంపారు. మగ్గాన్ని ముక్కలుగా చేసి నిప్పు పెట్టారు. ఆ తర్వాత శేషయ్యను వేటకొడవల్లు, గొడ్డండ్లతో నరికి చంపారు. ఇంటి బయట గొళ్ళెం పెట్టి, అంజయ్యను, అతని కుటుంబాన్ని సజీవదహనం కావించారు.

ఊరు మంటల్లో భయంకరంగా కనిపించసాగింది. గోరికోలు వంగుతున్నాయి. దహనకాండ యథేచ్ఛగా సాగిపోసాగింది. ఇక ఎల్మంచ వంతొచ్చింది. ఎల్మంచ ఇంటి తలుపుల్ని దబదబ బాదసాగారు దొర మనుషులు. ఓ నాలుగు తపంచాలు ఇంటిమీద విసరేసారు. ఎల్మంచకు పరిస్థితి క్షణాల్లో అర్థమైంది.

"నువ్వు పెద్ద మొనగాడివిరా? నామీదే పోటీకి నిలబెడ్తావురా?! ఎన్నికలయ్యేంతవరకు బతకగలవేమో సూస్కో" దొర మాటలు ఎల్మంచ చెవుల్లో వినబడసాగాయి. ముందుజాగ్రత్తగా ఎల్మంచ, తన భార్యాపిల్లల్ని, భార్య పుట్టింటికి పంపించేసాడు.

తలుపులు బాదటం పెరగటంతో ఇంటి వెనకాల తలుపులు తెరుచుకొని పరుగెత్తసాగాడు ఎల్మంచ. దొర మనుషులు ఇంటి వెనక కూడా మాటు వేసారు.

"అరే ఉర్కుతండ్రోయ్ పట్టుకొని నరకండ్రా" ఒక్క పెట్టున అరిచారు.

ఎల్మంచ పరుగెత్తసాగాడు. లుంగి ఎప్పుడో జారిపోయింది. ఏ ఇంట్లోకి జొరబడదామన్నా అన్ని ఇంటి తలుపులు మూసే ఉన్నాయి. ఊరంతా పొగతో నిండిపోయింది. తన మిత్రుల్ని దొర చంపి ఉంటాడని ఎల్మంచ అర్థం చేసుకున్నాడు. సందుగొందులు పరుగెత్తి, తిరిగి తన ఇల్లు సమీపంలోని చేదబావి సమీపంలోకి వచ్చాడు. అక్కడ దొర, తన అనుచరులతో ఎదురుచూస్తున్నాడు.

'కొడుకు దొరికిండ్రా' అంటూ కత్తి పైకెత్తాడు. చేదబావి బిందె పెట్టే గుంట రక్తంతో నిండింది. గిలకలేని ఆ బావి వైపు చూస్తూ ఎల్మంచ కళ్ళు నిలబడిపోయాయి.

ఇంకా తెల్లవారలేదు. అమావాస్య రోజులు. చీకటి దట్టంగానే ఉంది. మిణుకుమంటున్న లాంతర్ల వెలుగు తగ్గించుకోసాగాయి. ఆ ఊరు 'దినం' కార్యక్రమాలకు సిద్ధమవుతున్నట్లుంది. ఎక్కడో కోడి కూసింది. అంతే... వరసబెట్టి కోళ్ళు కూయసాగాయి. మేలుకొలుపు కూతలు కావవి. మంటల్లో కాలుతున్నందుకు చేస్తున్న ఆర్తనాదాలు. ఊరు కాలింది కదా! ●